క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించాలి



ఉపాధి పనుల్లో కూలీలు

గూడెంకొత్తవీధి: ఉపాధి హామీ కూలీల డబ్బులను వెంటనే చెల్లించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ అన్నారు. దేవరాపల్లి పంచాయతీలో మంగళ పాలెంతో పాటు మరో రెండు గ్రామాల వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడారు. నెలల తరబడి కూలీల డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై తొమ్మిదిన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పే స్లిప్‌లను ఇవ్వడం లేదన్నారు వేసవి అలవెన్సులను 30 శాతం ఇవ్వాలని ,పనిచేసే చోట్ల టెంట్‌లు వేయాలన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



చంద్రుపల్లిలో వైద్య శిబిరం

సీలేరు: సీలేరు పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. సీలేరు పిహెచ్‌సీ పరిధిలోని లైకోన్‌పూర్, చంద్రుపల్లి గ్రామాలను వైద్యాధికారి ఎస్కే ఖాదర్ మస్తాన్‌వల్లీ, హెల్త్ అసిస్టెంట్‌లు సత్యనారాయణ, ఎం.త్రినాథ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు జ్వర పరీక్షలు చేశారు. లైకోన్‌పూర్‌లో-12 మంది , చంద్రుపల్లిలో-11 మంది అనారోగ్యంతో ఉన్నట్టు గుర్తించారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,కాచి చల్లార్చిన నీటినే తాగాలని గ్రామస్తులకు సూచించారు.


అత్యవసర సమయాల్లో సత్వర సేవలు అందించాలి



ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్

పాడేరు : అనారోగ్యాల బారిన పడి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు కల్పించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ కోరారు. ఆయన స్థానిక జిల్లా ఆస్పత్రిని శనివారం సందర్శించారు. వార్డులోకి వెళ్లి చికిత్సలు పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడి వారిని పరామర్శించి అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయాల్లో సత్వర సేవలు అందించాలని ఆస్పత్రి జనరల్ సర్జన్ డాక్టర్ రవికిరణ్‌ను కోరారు. ఆయన వెంట రూఢకోట సర్పంచ్ కాతరి సురేష్‌కుమార్ తదితరులున్నారు.

అనాథ పిల్లలకు ఆధార్‌కార్డులు అందజేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ మురళీగంగాధరరావు

రంపచోడవరం: అనాధ పిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డు వచ్చేలా చూడాలని రంపచోడవరం ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.మురళీ గంగాధరరావు అన్నారు. రంపచోడవరంలో కోర్టు ప్రాంగణంలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యానల్ లాయర్లు, పోలీస్‌శాఖ, రెవెన్యూశాఖ, విద్యశాఖ, ఆరోగ్యశాఖ అనాధ పిల్లలను గుర్తించి వారికి చిరునామా, జనన, కులధ్రువీకరణ పత్రాలు వచ్చేలా చూడాలన్నారు. న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

4న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

యలమంచిలి రూరల్:గాన గంధర్వుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వచ్చేనెల 4వ తేదీన యలమంచిలి గుర్రప్ప కల్యాణమండపంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ చైర్మన్ ముత్తుర్తి రామారావు తెలిపారు.ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా గాయకులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు.పోటీల్లో మొదటి మూడు స్థానాల విజేతలకు నగదు బహుమతులు,జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు. ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయన్నారు.అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఎస్పీ బాలు పాటల సంగీత విభావరి నిర్వహించనున్నట్టు తెలిపారు. వివరాలకు 9866307171,9948218717 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని రామారావు కోరారు.

పిడుగుల కాలం.. అప్రమత్తం

- ఏటా పెరుగుతున్న పిడుగుపాటు మరణాలు
- సముద్ర మట్టానికి 3 వేల అడుగుల ఎత్తులో మన్యం
- తీరని ప్రాణ, ఆస్తినష్టం



పిడుగు పడడానికి ముందు మెరుపు


కొయ్యూరు: పెరిగిపోతోన్న ఉష్ణోగ్రతలు.. తరిగిపోతున్న అడవులు..వేడెక్కుతోన్న భూ వాతావరణం..అనేక చోట్ల నీటి వనరులు అంతరించడం మూలంగా పిడుగుల మరణాలు ఏటా పెరుగుతున్నాయి.

సముద్ర మట్టానికి మూడు వేల అడుగుల ఎత్తులో ఉన్న అల్లూరి జిల్లాలోను ఈ పిడుగులు ఎక్కువ అవుతున్నాయి. దీని మూలంగా మేకలు, పశువులు పదుల సంఖ్యలో మృతి చెందుతున్నాయి. మనుషుల మరణాలు పెరుగుతున్నాయి. ఫలితంగా తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. ప్రతీరోజూ విపత్తుల నిర్వాహణ సంస్థ నుంచి పిడుగులు పడే అవకాశ ఉందని, అప్రమత్తంగా ఉండాలని మొబైల్



పిడుగుపాటుకు దగ్ధమవుతున్న తాటిచెట్టు (ఫైల్)

ఫోన్లు ఉన్న అందరికి సం



మొబైల్ ఫోన్లకు వస్తున్న సమాచారం

క్షిప్త సమాచారం(ఎస్ఎంఎస్)లు వస్తున్నాయి. ఈ మేరకు ఏదో ఒక చోట పిడుగులు పడుతున్నాయి.



పిడుగుపాటుకు మరణించిన పశువులు (ఫైల్)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విపత్తుల నిర్వాహణ సంస్థ నుంచి పిడుగులు పడే అవకాశం ఉందని సమాచారం రాగానే ప్రధానంగా పశువులు లేదా మేకలను కొండలపైకి తీసుక్కెళ్లే కాపర్లు అప్రమత్తంగా ఉండాలని వాతావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.
- రహదారులపై హోర్డింగులు, ఎత్తైన, బలహీన చెట్లు కింద, సమీపంలో నిలుచోవద్దు.
- పిడుగులకు కేబుల్ టీవీ, కంప్యూటర్లు వంటి విద్యుత్ ఉపకరణాలు ఆపేసి కనెక్షన్లు తొలగించాలి.
- ఉరుములు, మెరుపులు, పిడుగులు చెరువు నీటిని ఆకర్షిస్తాయి. ఆయా ప్రదేశాలకు దూరంగా ఉండాలి. వర్షం పడుతున్న సమయంలో ట్రాక్టర్‌తో పనులు నిలిపివేయాలి. పిడుగు పడితే లోహపు భాగాలను ఆకర్షించడంతో విద్యుత్‌దాఘాతానికి గురుయ్యే ప్రమాదం ఉంటుంది.
- హై టెన్షన్ వైర్లు, సెల్ టవర్ల కింద ఉండకుండా చూసుకోవాలి.
- పిడుగులు పడతాయని భావిస్తే నేలమీద పడుకోవాలి.
- ప్రయాణం చేసే వ్యక్తులు మెరుపులు వస్తున్నప్పుడే ఏదో ఒక చోట ఆగిపోవడం మేలు. ఇంటి లోపల ఉండడం మరింత ఉత్తమం.

అధిక ఉష్ణోగ్రతతో పిడుగుపాటు

వేడి ఎక్కువగా ఉన్న సమయంలో మేఘాలు కమ్మితే పిడుగుల పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఆకాశం కారుమబ్బులతో నిండినపుడు మబ్బు పై భాగంలో ధనశక్తి, కింది భాగంలో రుణశక్తి ఉంటాయి. ఈ రెండు ఆకర్షణకులోనై అత్యధిక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. చుట్టూ గాలిలో సుమారు 30వేల డ్రిగీల సెంటీగ్రేడ్ వేడి ఉత్పత్తి అవుతుంది. అదే మెరుపు, ఇలా వేడెక్కిన గాలి ఒక్కసారిగా వ్యాకోచం చెందితే పెద్ద శబ్దం వస్తే ఉరుము ఒక్కోసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతోంది. దీంతో పిడుగు సంభవిస్తుంది. వేసవి, వానాకాలంలో పిడుగులు ఎక్కువగా పడుతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిడిగు పడే సమయంలో అక్కడ గాలిలో ఉష్ణోగ్రత 30వేల డిగ్రీలు చేరుతుందని పేర్కొంటున్నారు. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

మరణాలు అధికం

నేరుగా మనుషులపై పిడుగు పడితే గుండెపోటుతో సంభవించే మరణాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగు ఉష్ణోగ్రత మానవ శరీరం తట్టుకోలేదు. దాని నుంచి వచ్చే విద్యుత్ ప్రవాహం గుండెపై ప్రబావాన్ని చూపిస్తుంది.

దీని మూలంగా మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒకవేళ పిడుగుపాటుతో త్రుటిలో తప్పించుకున్న అక్కడ సమీపంలో ఉన్న వారికి నరాల బలహీనత లేదా పక్షవాతం రావడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఇక కొద్ది దూరంలో పిడుగు పడితే దాని శబ్దానికి పూర్తిగా చెవుడు వస్తుంది. దీంతో పాటు నరాల బలహీనత లాంటి సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

వేసవిలో పిడుగులు ఎక్కువ



ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ రెండో వారం వరకు ఎక్కువగా పిడుగులు పడతాయి. ఆ సమయంలో వాతావరణం బాగా వేడిగా ఉంటుంది.దీని మూలంగా మేఘాలలో విద్యుత్ ప్రవాహం ఎక్కువై పిడుగులు సంభవిస్తాయి. జూన్ తర్వాత కురిసే వర్షాలకు పిడుగులు పెద్దగా రావు. అప్పుడు వాతావరణం చల్లగా ఉండడమే కారణం. మన్యం సముద్ర మట్టానికి మూడువేల అడుగుల ఎత్తులో ఉంది. దీని మూలంగా ఇక్కడే ఎక్కువగా పిడుగులు పడతాయి. సరైన జాగ్రత్తలు పాటిస్తే పిడుగుల నుంచి రక్షణ పొందవచ్చు – **డాక్టర్ అప్పలస్వామి**, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏడీఆర్

విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు



సహాయ వ్యవసాయ సంచాలకులు సావిత్రి

అడ్డతీగల: రానున్న ఖరీఫ్ సీజన్‌లోని రైతుల అవసరాలకు వరి విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు పంపినట్టు అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు కంకిపాటి సావిత్రి తెలిపారు. అడ్డతీగల సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాలకు ప్రతిపాదించిన విత్తనాల వివరాలను ఆమె వెల్లడించారు. అడ్డతీగల-67 మెట్రిక్ టన్నులు, గంగవరం-54.8 మెట్రిక్ టన్నులు, వై.రామవరం-36 మెట్రిక్ టన్నులు, రాజవొమ్మంగి-100 మెట్రిక్ టన్నులు విత్తనాలు అవసరమున్నట్టు నివేదికలో ప్రస్తావించామన్నారు. ఈ ప్రాంతం వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం ఆధారంగా పండించే విత్తన రకాలను కేటాయించాలని కోరామన్నారు. ఆర్‌జిఎల్-2537, ఎంటీయు-1121, 1318, 7029, 1061, 1064, బీపీటీ -5204, ఎన్ఎల్ఆర్-34449, ఆర్ఎన్ఆర్-15048 రకాల విత్తనాలు కావాల్సి ఉందని తెలిపామన్నారు. మరో వారం రోజుల్లో ఆయా వరి విత్తనాలు అందుబాటులోనికి వస్తాయన్నారు. విత్తనాలు వచ్చిన తరువాత మొలకశాతాన్ని పరిశీలించి అనంతరం రైతులకు అందిస్తామన్నారు.

అధ్వానంగా బీఎస్ఎన్ఎల్ సేవలు

కొయ్యూరు: బీఎస్ఎస్ఎల్ సేవలు అధ్వానంగా మారాయి. ఎప్పుడు నెట్‌వర్క్ సేవలు నిలిచిపోతాయో తెలియని దుస్థితి. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అనేక మంది బీఎస్ఎన్ఎల్ బ్రాడ్ బ్యాండ్ సేవలపై ఆధారపడి ఉన్నారు. శనివారం ఉదయం నుంచి దాని సేవలు నిలిచిపోయాయి. దీనిని వెంటనే సరిచేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. నిత్యం ఏదో ఒక చోట కేబుల్ తెగిపోవడంతో సేవలకు అంతరాయం కలగుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

శ్రమదానంతో తాత్కాలిక వంతెన ఏర్పాటు



కర్రలతో ఏర్పాటు చేసుకున్న వంతెన

గూడెంకొత్తవీధి: ఎంతకాలం అధికారుల కోసం ఎదురు చూసినా.. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాదని గ్రామస్తులు భావించారు. దీంతో వారి గ్రామానికి వంతెన లేని సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.ఒకరికి ఒకరు తోడై పెద్ద కర్రలతో వంతెనను శ్రమదానం ద్వారా ఏర్పాటు చేసుకున్నారు. రింతాడ పంచాయతీ కాకరపాడుకు సరైన రహదారి సౌకర్యం లేదు. గ్రామానికి సమీపంలో పెద్ద కాలువ ఉంది. వర్షం వస్తే అది పొంగి ప్రవహిస్తోంది. ఆ సమయంలో దానిని దాటడం అసాధ్యం. ఎవరికి అత్యవస సేవలు అవసరమైన, ఎలాంటి సమస్య వచ్చినా వారి అదృష్టంపై చావు బతుకులు ఆధారపడి ఉంటాయి. వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తులు పలు మార్లు అధికారులకు విన్నవించుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామస్తులంతా కలిసి కర్రలతో వంతెనను ఏర్పాటు చేసుకున్నారు. ఇది కొంత వరకు ఉపయోగపడుతుందని వారు చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాపై శనివారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కలుగుతుందని, విద్యార్థులు రోజూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని జూన్ 21వ తేదీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ పీవో వై.విజయలక్ష్మి, అనితకుమారి, నాగబాబులు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అధ్యాపకులు బి.లచ్చన్న, కామేశ్వరరావు, ఎస్.అప్పారావు, కె.అంబికా, ఎస్.సురేష్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రోగులకు అందిస్తున్న సేవలపై డాక్టర్‌తో మాట్లాడుతున్న అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే మత్స్యలింగం శనివారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులను కలిసి, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రక్తపరీక్ష, బీపీ తదితర పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రలపై గిరిజనులకు నమ్మకం కలిగించేందుకే తాను ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యం పొందుతున్నానన్నారు. వార్డుల్లో తిరిగి రోగులను పరామర్శించారు.మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకుడు రమేష్ ఉన్నారు.

యోగా టీచర్లకు శిక్షణ



ఆసనాలు వేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బాలయ్య పడాల్

చింతపల్లి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ నెల 27 నుంచి 31 వరకూ మండల స్థాయిలో యోగా మాస్టర్స్ ఆఫ్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామ స్థాయిలో యోగా ట్రైనర్స్ ఆధ్వర్యంలో జూన్ 3 నుంచి 18వ తేదీ వరకూ మూడు దశలో శిక్షణ అందిస్తామన్నారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్, వైద్యాధికారి విజయ్, లంబసింగి వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్‌తో పాటు చింతపల్లి, జీకే వీధి మండలాలకు చెందిన వ్యాయాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



సీతపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ మలుపు వద్ద చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

రంపచోడవరం: కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. భద్రాచలం నుంచి 55 మంది ప్రయాణికులతో కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు సీతపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ వద్ద మలుపులో ఇసుక లారీని తప్పించబోయి చెట్టుని ఢీకొంది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఎవరికి ఎటువంటి గాయాలుకాలేదు. 55 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు ప్రమాద సంఘటనను తెలుసుకున్న స్థానిక ఎస్ఐ వెంకట్రావు అక్కడ వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రయాణికులను అదే బస్సులో గోకవరం వరకు తరలించి అక్కడ నుంచి మరో బస్సులో ప్రయాణికులను కాకినాడ పంపించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గంగాభవానీకి ఘన నివాళి



గంగాభవానీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతి, నాగులాపల్లి ధనలక్ష్మి, కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి తదితరులు

సాక్షి,పాడేరు: మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి చిట్టినాయుడు భార్య, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాతృమూర్తి కొట్టగుళ్లి గంగాభవానీ సంస్మరణ సభను శనివారం స్థానిక కాఫీ అతిథి గృహంలో నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గంగాభవానీ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన గంగాభవానీ సంస్మరణ సభకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, వర్తకులు తదితరులు హాజరై గంగాభవానీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు మాజీ ఎంపీ గొడ్డెటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతి, నాగులాపల్లి ధనలక్ష్మి, గిడ్డి ఈశ్వరి, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడుతో పాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు గంగభవాని చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులతో పాటు కొట్టగుళ్లి ఈశ్వర ప్రసాద్‌ను వారంతా పరామర్శించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు: ప్రభుత్వ భూముల ఆక్రమణలు గుర్తించి వెంటనే నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో ప్రసాద్ శనివారం పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు కార్యదర్శులు విధిగా ప్రభుత్వ భూముల ఆక్రమణలను రెవెన్యూ అధికారులుతో కలిసి గుర్తించాలన్నారు.దీని అనంతరం వారు ఖాళీ చేసేందుకు వీలుగా నోటీసులు జారీ చేయాలన్నారు.ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. చెరువుల నుంచి ఇతర స్థలాల వరకు ఆక్రమణలుంటే గుర్తించి చర్యలు తీసకోవాలని సూచించారు.

అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఒకో సచివాలయం పరిధిలో ఏడుగురికి శిక్షణ ఇచ్చిన తర్వాత అక్కడ నుంచి 50 మందికి యోగాపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. అధికారులు అంతా దీనికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు రాంబాబు, నాగభూషణం, ఏపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తుంగమడుగులలో చోరీ

అడ్డతీగల: అడ్డతీగల మండలం తుంగమడుగులలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాకూరి చిలకమ్మ ఇంట్లోని బీరువా పగలకొట్టి గుర్తు తెలియని దుండగులు నాలుగు కాసుల బంగారు వస్తువులు, రూ.30 వేలు నగదును చోరీ చేశారు. బాధితురాలు చిలకమ్మ ఫిర్యాదు మేరకు అడ్డతీగల పోలీసులు శనివారం సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు. తుంగమడుగులలో శుక్రవారం చిలకమ్మ బంధువులతో కలిసి వివాహానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్లి చూసేసరికి బీరువా పగలకొట్టి ఉందని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ చోరీ జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతికి సంతాపం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సీడీపీవో దేవమణి

రాజవొమ్మంగి: మండలంలోని కింద్రకాలనీ అంగన్‌వాడీ టీచర్ రాజులమ్మ (47) ఆకస్మిక మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసారు. రాజులమ్మ శుక్రవారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆమెను కుటుంబీకులు లాగరాయి పీహెచ్‌సీకు తరలించారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాజులమ్మ మృతికి స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సీఐటీయూ నేతలు విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. సీడీపీఓ దేవమణి ఆ కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు ప్రభుత్వం తరపున రూ. 15వేల ఆర్థిక సాయం దించారు. రాజులమ్మ కుటుంబసభ్యులను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శనివారం ఆ గ్రామం వెళ్లి పరామర్శించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



గిరిజన సంఘం నేత బాలదేవ్, సెక్యూరిటీ సంఘం నాయకులు

పాడేరు రూరల్: గురుకులం, ఏకలవ్య పాఠశాలల వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ సెక్యూరిటీ గార్డుల మూడు నెలల బకాయి వేతనాలను తక్షణం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, సెక్యూరిటీల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలో 20 ఏకలవ్య, గురుకులం, పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహిపస్తున్న సుమారు 100 మంది ఆదివాసీ సెక్యూరిటి గార్డుల వేతనాలు తక్షణం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సెక్యూరిటీ గార్డులకు అవసరమైన బూట్లు, యూనిఫాంలు, టోపీ, టార్చిలైట్, లాఠీ రక్షణ పరికరాలను అందజేయాలని, వారాంతపు సెలవులు మంజురు చేయాలన్నారు. ఆదివాసీ సెక్యూరిటీ గార్డుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీతమ్మ, ప్రశాంతి, నాయకులు రాజమ్మ, మమతా తదితరులు పాల్గొన్నారు.